సాక్షి
కర్నూలు
శనివారం । 6 । జనవరి । 2024



భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. అలాగే శ్రీశైల గ్రామ దేవత అంకాళమ్మకు విశేషపూజలు నిర్వహించారు.



శాస్త్రోక్తంగా ధనుర్మాస పూజలు

ఆళ్లగడ్డ: ధనుర్మాస అధ్యయనోత్సవాల సందర్భంగా శుక్రవారం అహోబిలంలో ఉత్సవమూర్తులను యాగశాలలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించారు.



తిరుపతి ప్రయాణికులకు మనవి

నంద్యాల నుంచి తిరుపతి వెళ్లేందుకు మరో రైలు అందుబాటులోకి వచ్చింది. నంద్యాల-కడప మధ్య నడిచే 07285/07284 డెమో రైలును రేణిగుంట వరకు పొడిగించారు. 8లో▸

న్యూస్‌రీల్

శ్రీమఠం పీఠాధిపతికి 'అయోధ్య' ఆహ్వానం



శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులతో శ్రీరామ క్షేత్ర ట్రస్ట్ నిర్వాహకులు బసవన్నగౌడ్

ఆదోనిఅర్బన్: అయోధ్యలో ఈనెల 22వ తేదీన జరిగే శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపనకు రావాలని కోరుతూ మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులుకు ఆదోని పట్టణానికి చెందిన శ్రీరామక్షేత్ర ట్రస్ట్ నిర్వాహకులు, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్ ఆహ్వాన పత్రికను అందజేశారు. శుక్రవారం నేరుగా మంత్రాలయం మఠానికి వెళ్లి పీఠాధిపతికి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను, ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా బసవన్నగౌడ్ మాట్లాడుతూ.. అయోధ్యలో జరిగే కార్యక్రమానికి ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలువురికి ఆహ్వానం వచ్చిందని, అందులో మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి ఉన్నారని తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రాంత కార్యాలయ సంయుక్త కార్యదర్శి ప్రాణేష్, కోశాధికారి మహేష్, ట్రెజరర్ జి.సుబ్రమ్మణ్యం పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 18 మంది డిబార్

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న సెమిస్టర్ పరీక్షల్లో శుక్రవారం 18 మంది డిబార్ అయ్యారు. 5వ సెమిస్టర్ పరీక్షకు 7,258 మందికిగాను 6538 మంది, మొదటి సెమిస్టర్‌కు 11563 మందికిగాను 10417 మంది హాజరైనట్లు ఆర్‌యూ అధికారులు తెలిపారు.

సీడ్ ఫామ్‌ల అభివృద్ధిపై దృష్టి

- రూ.35 లక్షలతో గోదాము, సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వ్యవసాయ క్షేత్రాలను మరింత బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. కర్నూలు మండలంలోని ఎదురూరు ఫామ్, ఎమ్మిగనూరు మండలంలోని ముగతి పీడీ డి.ఫామ్, నంద్యాల జిల్లాలో తంగడెంచ ఫామ్‌లు ఉన్నాయి. ప్రతి ఫామ్‌లో రూ.35 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. 200 టన్నుల సామర్థ్యం కలిగిన గోదాము, సీడ్ ప్రాసెసింగ్ యూనిట్, సీడ్ ప్రాసెసింగ్‌కు అవసరమైన ఎక్విప్‌మెంటు, పంట నూర్పిడి కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రూ.35 లక్షల వ్యయంతో వీటిని సిద్ధం చేసేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ఈ మేరకు రెండు రోజుల్లో ప్రతిపాదనలు పంపాలని వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ కర్నూలు, నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

ఊపందుకున్న పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ఊపందుకుంది. కొత్తాళం, కర్నూలు రూరల్, దేవనకొండ, మద్దికెర మండలాలు మినహా మిగిలిన అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో పింఛన్ల పంపిణీ మొదలైంది. ఈ మండలాల్లో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సంబంధిత శాసన సభ్యులు ప్రారంభిస్తారు. శుక్రవారం నందవరం, సి.బెళగల్, పెద్దకడుబూరు, ఆస్పరి మండలాల్లో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు చేపట్టారు. కర్నూలు జిల్లాలో మొత్తం 2,48,072 పింఛన్లు ఉండగా.. ఈ నెల 5వ తేదీ సాయంత్రం 6 గంటల సమయానికి 98,542 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. పంపిణీ గడువును పొడిగించే అవకాశం ఉంది.

- నంద్యాల జిల్లాలో పంపిణీ 50.84 శాతం పూర్తయింది. జిల్లాలో 2,24,228 పింఛన్లు ఉండగా.. 1,13,996 పింఛన్లు పంపిణీ చేశారు.

నేడు, రేపు పోలీసు క్రీడలు

కర్నూలు: కర్నూలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 6, 7 తేదీల్లో పోలీసు క్రీడాపోటీలు జరగనున్నాయి. గేమ్స్, ట్రాక్స్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లకు సంబంధించిన పోటీలు నిర్వహించనున్నారు. జిల్లాలోని పోలీసు సబ్ డివిజన్ వారీగా ఏర్పాటు చేసే టీములు పోటీల్లో పాల్గొంటాయని జిల్లా పోలీసు కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 1500 మీటర్లు, లాంగ్ జంప్, జావెలిన్ త్రో, షార్ట్‌పుట్, ఆటలకు సంబంధించి కబడ్డీ, వాలీబాల్, షటిల్ ఫర్ ఆఫీసర్స్ పోటీలు జరుగుతాయి. పోటీల్లో పాల్గొనేవారికి వసతి కల్పిస్తామని ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఏఆర్ డీఎస్పీ ఇలియాస్ 9121101066, రెండో పట్టణ సీఐ 9121101059 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

కరెంట్ వేగంతో కనెక్షన్!

- జాప్యం లేకుండా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు
- దరఖాస్తు చేసినప్పటి నుంచి 11 రోజుల్లోనే అనుమతులు
- నగదు చెల్లించిన తర్వాత 30 రోజుల్లోనే విద్యుత్ కనెక్షన్
- రైతు నేస్తం పోర్టల్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ
- నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ మంజూరు ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందుకోసం విద్యుత్ శాఖ రైతు నేస్తం పోర్టల్‌ను ఉపయోగిస్తోంది. అన్ని అర్హతలు ఉన్నా నిర్ణీత కాలపరిమితిలో అన్నదాతకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేకపోతే సంబంధిత అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.



57,878 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత రికార్డు స్థాయిలో వ్యవసాయానికి విద్యుత్ కనెక్షన్లు విడుదలయ్యాయి. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 57,878 విడుదల చేయడం విశేషం. వ్యవసాయంతో పాటు ఆక్వా రంగం, పౌల్ట్రీ రంగాన్ని కూడా ఉచిత విద్యుత్‌తో ప్రభుత్వం ఆదుకుంటోంది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ముమ్మరంగా ఇస్తుండటంతో బోరుబావుల కింద రైతులు ముమ్మరంగా పంటలు సాగు చేస్తున్నారు.

కర్నూలు(అగ్రికల్చర్): రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. వ్యవసాయ సంబంధిత సమస్యలకు వెనువెంటనే పరిష్కారం చూపుతోంది. ఈ కోవలోనే జాప్యం లేకుండా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తోంది. గతంలో విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు వచ్చినప్పటి నుంచి ఎస్టిమేట్లు వేయడం, వాటిని మంజూరు చేయడం.. తీవ్రమైన జాప్యం జరిగేది. సత్వరం విద్యుత్ కనెక్షన్ తీసుకొని బోరు కింద పంటలు పండించుకోవాలనే ఆశలు నీరుగారిపోయేవి. క్షేత్రస్థాయిలో జాప్యాన్ని నివారించి అత్యంత వేగంగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఏపీఎస్పీడీసీఎల్ నిర్ణీత కాలపరిమితిని నిర్ణయించి, ప్రత్యేకంగా రైతు నేస్తం పోర్టల్‌ను రూపొందించింది. దీని ద్వారా ఉన్నతాధికారులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తారు. నిర్ణీత సమయంలోగా దరఖాస్తుపై చర్యలు లేకపోతే సంజాయిషీ అడుగుతారు. సంజాయిషీ సరిగ్గా లేకపోతే చర్యలు తీసుకోనున్నారు.

రైతులు ఇలా చేయాలి..

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ పొందడానికి సులభంగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను అప్‌లోడ్ చేయవచ్చు. ఉచిత విద్యుత్ కనెక్షన్ కోసం రైతులు గ్రామ సచివాలయాలను, మీ సేవ కేంద్రాలను సంప్రదించవచ్చు. లేదంటే ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తుతో పాటు తగిన డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. దరఖాస్తు వెంట వాల్టా సర్టిఫికెట్, పట్టాదారు పాసుపుస్తకం, రైతు ఆధార్, బ్యాంకు ఖాతా, గ్రౌండ్ వాటర్ పీజుబులిటీ సర్టిఫికెట్‌లు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. దరఖాస్తులు సంబంధిత మండల విద్యుత్ అసిస్టెంటు ఇంజనీర్ లాగిన్‌కు వెళ్తాయి.

వెనువెంటనే అధికారుల స్పందన

ఉచిత విద్యుత్ కనెక్షన్ కోసం రైతు అప్‌లోడ్ చేసిన దరఖాస్తుపై సంబంధిత మండల విద్యుత్ అసిస్టెంటు ఇంజనీర్ ఏడు రోజుల్లో అంచనాలు (ఎస్టిమేట్లు) రూపొందించాల్సి ఉంది. రైతు పొలాన్ని, బోరు పాయింట్‌ను పరిశీలించి 11 కేవీ లైన్ అవసరమా లేదా ఎల్‌టీ లైన్ అవసరమా గుర్తించి ఎస్టిమేట్లు వేస్తారు. ఎస్టిమేట్‌లను సంబంధిత ఏఈ ఏడు రోజుల్లో జనరేట్ చేయాల్సి ఉంది. ఒక్క రోజు గ్రేస్ పీరియడ్ ఉంటుంది. ఏడు రోజుల్లో వేయలేకపోతే... గ్రేస్ పీరియడ్‌లోనైనా జనరేట్ చేయాల్సి ఉంది. గ్రేస్ పీరియడ్‌లోపు ఎస్టిమేట్లు జనరేట్ చేస్తే.. అవి ఏడీఈ లాగిన్‌కు వెళ్తాయి. ఆయన వాటిని రెండు రోజుల్లో ఆమోదించి డీఈఈ లాగిన్‌కు పంపుతారు. వీటిని డీఈఈ పరిశీలించి ఆమోదిస్తారు. ఎస్టిమేట్లకు ఆమోదం లభించిన వెంటనే డిమాండ్ నోటీసు జనరేట్ అవుతుంది. దరఖాస్తును ఆమోదించినట్లు, ఎస్టిమేట్ అమౌంటు వెంటనే చెల్లించాలని రైతు ఫోన్‌కు ఎస్ఎంఎస్ కూడా వెళ్తుంది. ఎస్ఎంఎస్‌తో పాటు డిమాండ్ నోటీసు కూడా ఇస్తారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఎస్టిమేట్లు వేయడం మొదలు... ఏడీఈ ఆమోదం, డీఈఈ మంజూరు ప్రక్రియ కేవలం 11 రోజుల్లోనే ముగుస్తుంది. ఎస్టిమేట్ అమౌంట్ రైతు చెల్లించిన రోజు నుంచి 30 రోజుల్లో లైన్ వేయడం, ట్రాన్స్‌ఫార్మర్ పెట్టడం, కనెక్షన్ ఇవ్వడం పూర్తి చేస్తారు. ఈ ప్రక్రియను ఏపీఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులు రైతు నేస్తం పోర్టల్‌లో పర్యవేక్షిస్తుంటారు.

గడువులోపు చేయకపోతే?

అప్‌లోడ్ చేసిన దరఖాస్తుపై సంబంధిత అసిస్టెంటు ఇంజనీర్ ఏడు రోజులు, గ్రేస్ పీరియడ్ ముగిసేలోపు ఎస్టిమేట్లు జనరేట్ చేయకపోతే దరఖాస్తు ఏఈ లాగిన్‌లో కనపడదు. గ్రేస్ పీరియడ్ ముగిసిన వెంటనే ఏఈ లాగిన్ నుంచి ఏడీఈ(అసిస్టెంటు డైరెక్టర్ అఫ్ ఎలక్ట్రికల్) లాగిన్‌కు వెళ్తుంది. ఏడీఈ కూడా రెండు రోజుల్లో ఎస్టిమేట్లు జనరేట్ చేయాలి. ఈయన పట్టించుకోకపోతే మూడో రోజున డీఈఈ లాగిన్‌కు వెళ్తుంది. డీఈఈ కూడా రెండు రోజుల్లోనే దరఖాస్తుపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. అక్కడా పట్టించుకోకపోతే సర్కిల్ ఎస్ఈ లాగిన్‌కు వస్తుంది. అక్కడ విధిగా దరఖాస్తుపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. గడువులోపు దరఖాస్తుపై స్పందించకుంటే వివరణ అడిగి.. సంతృప్తి కరంగా లేకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు.

రైతులకు అవగాహన



వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల విడుదల మరింత పారదర్శకంగా చేపట్టాలనేది ప్రభుత్వ ఉద్దేశం. ఇందుకోసం విద్యుత్ శాఖ రైతు నేస్తం పోర్టల్‌ను ఇటీవలే రూపొందించింది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల విడుదలకు నిర్ణీత సమయం ఉంది. విద్యుత్ కనెక్షన్ల మంజూరు ప్రక్రియ మొత్తం రైతు నేస్తం పోర్టల్ ద్వారానే జరుగుతుంది. దీనిపై ఇటు రైతులకు, అధికారులకు కూడా సమగ్రంగా అవగాహన కల్పిస్తున్నాం.

– ఎం.ఉమాపతి, ఎస్ఈ, ఏపీఎస్పీడీసీఎల్, కర్నూలు సర్కిల్

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమం

- పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాల అందజేత
- జిల్లాలో 3,089 మంది లబ్ధిదారులకు రూ.4.78 కోట్ల లబ్ధి
- తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి జమ చేసిన సీఎం జగన్
- లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేసిన జెడ్పీ చైర్మన్, ఎంపీ, మేయర్, ఎమ్మెల్యేలు



లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, ఎంపీ సంజీవ్‌కుమార్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మేయర్ రామయ్య, ఎమ్మెల్యేలు కంగాటి శ్రీదేవి, కాటసాని తదితరులు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, మేయర్ బీవై రామయ్య అన్నారు. అర్హత ఉండి ఏ కారణంతో సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. వివిధ సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి మిగిలి పోయినా వారిని ఎంపిక చేసేందుకు అధికారులు జల్లెడ పడుతున్నట్లు చెప్పారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2023 ఆగస్టు నుంచి 2023 డిసెంబర్ వరకు జిల్లాలో మిగిలి పోయి అర్హత ఉన్న 3,089 మందికి బటన్ నొక్కి రూ.4.78కోట్లను జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కంగాటి శ్రీదేవి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ శిరోమణి మద్దయ్య, జిల్లా అధికారులు వర్చువల్‌గా వీక్షించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలను చూసి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అర్హత ఉన్న వారికి ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పరంగా ఆదుకోవాలన్నదే సీఎం లక్ష్యమన్నారు. అందులో భాగంగా సంవత్సరానికి రెండు సార్లు మిగిలి పోయిన లబ్ధిదారులను ఎంపిక చేసి సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నట్లు వివరించారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ.. ఆధార్ మిస్ మ్యాచ్, ఈకేవైసీ పెండింగ్ తదితర సాంకేతిక కారణాలను సరి చేసి అర్హులు చేసినట్లు చెప్పారు. ఇందులో భాగంగా జిల్లాలో 3,089 మంది లబ్ధిదారులకు ఆర్థిక సాయంగా రూ.4.78 కోట్లను జమ చేసినట్లు చెప్పారు. ఈబీసీ నేస్తం ద్వారా 97 మంది లబ్ధిదారులకు రూ.1.45 లక్షలు, జగనన్న అమ్మ ఒడి ద్వారా 2,117 మంది లబ్ధిదారులకు రూ.3.10 కోట్లు, జగనన్న చేదోడు ద్వారా 635 మంది లబ్ధిదారులకు రూ.63.5 లక్షలు, వైఎస్ఆర్ కల్యాణ మస్తు /షాదీ తోఫా ద్వారా 91 మంది లబ్ధిదారులకు రూ.75.9 లక్షలు, వైఎస్ఆర్ కాపు నేస్తం ద్వారా 8 మంది లబ్ధిదారులకు రూ.1.20 లక్షలు, వైఎస్ఆర్ నేతన్న నేస్తం ద్వారా 17 మంది లబ్ధిదారులకు రూ.4.08 లక్షలు, వైఎస్ఆర్ వాహన మిత్ర ద్వారా 124 మంది లబ్ధిదారులకు రూ.17.9 లక్షలు జమైనట్లు చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు అధికారులు, ప్రజాప్రతినిధులు మెగా చెక్కును అందజేశారు. అలాగే నూతనంగా మంజూరైన 5 పెన్షన్లను కలుపుకొని జిల్లాలో పెన్షన్ల సంఖ్య 2,48,072 చేరుకుంది. వీరిలో ఒక్కొక్కరికీ రూ.3 వేల ప్రకారం నెలకు రూ.74.78 కోట్లకు సంబంధించిన మెగా చెక్కును కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ, డీఎల్‌డీఓ బాలకృష్ణ పాల్గొన్నారు.

పేదలకు న్యాయం చేస్తున్న సీఎం జగన్



నా భర్త చలపతి కిరాణం షాపులో పని చేస్తాడు. జగనన్న చేదోడు పథకానికి అర్హత ఉండి కూడా నేను లబ్ధి పొందలేకపోయాను. సచివాలయంలో విచారించగా సాంకేతిక లోపం అని చెప్పారు. ఉద్యోగులు విచారణ జరిపి నన్ను తిరిగి జగన్నచేదోడుకు అర్హత సాధించేలా సాంకేతిక తప్పులను సరిదిద్దారు. చాలా సంతోషంగా ఉంది. పేదలకు న్యాయం చేస్తున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.

– ఇందిరా భవాని, గణేష్ నగర్, కర్నూలు

రూ.లక్ష జమ అయ్యింది



మా అమ్మానాన్న ఇద్దరూ వ్యవసాయ కూలీలు. వారికి వచ్చే ఆదాయంతో ఇంటి పోషణ, అద్దె చెల్లించడమే ఇబ్బంది. ఈ సమయంలో నా పెళ్లి కోసం అప్పులు చేయాల్సి వచ్చింది. ఈ రోజు జగనన్న నన్ను సొంత చెల్లిగా భావించి నా పేరిట వైఎస్ఆర్ కల్యాణ మస్తులో లక్ష రూపాయలు జమ చేశారు. ఆ డబ్బుతో చేసిన అప్పుల ఊబి నుంచి బయట పడతాం. నేను జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనలతో డిగ్రీ కూడా పూర్తి చేశాను. మా తమ్ముడికి అమ్మ ఒడి ద్వారా ఏటా రూ.15వేలు అందుతోంది.

– మౌనికభాయ్, చిగుర్లతండా, తుగ్గలి మండలం

టేక్ హోం రేషన్ కిట్లను తక్షణమే పంపిణీ చేయాలి

- అధికారులను ఆదేశించిన జేసీ నారపురెడ్డి మౌర్య



కర్నూలు(సెంట్రల్): బాలింతలు, గర్భిణులకు టేక్ హోం రేషన్ కిట్లను తక్షణమే అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో టేక్ హోం రేషన్ కిట్ల పంపిణీపై సంబంధిత అధికారులతో జేసీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం అంగన్‌వాడీలు సమ్మెలో ఉండడంతో టేక్ హోం రేషన్ కిట్లను ఎండీయూ ఆపరేటర్లు, వలంటీర్లతో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ డీలరు ప్రతి నెలా 30వ తేదీ లోపు రేషన్‌ను ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి తీసుకెళ్లేలా చూడాలన్నారు. బియ్యంతోపాటు రాగులు కూడా అందుబాటులో ఉన్నాయని, వాటిని పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. హొళగుంద, హాలహర్వి ప్రాంతాల్లో రాగుల సరఫరా సరిగా లేదనే ఫిర్యాదులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీఎస్ఓ కేవీఎస్ఎం ప్రసాదు, సివిల్ సప్లై డీఎం షర్మిల పాల్గొన్నారు.

పల్లెల్లో పేదలకు 'స్పెషల్' వైద్యం



వైద్యులతో మాట్లాడుతున్న ఏపీఎంఐడీసీ ఎండీ మురళీధర్ రెడ్డి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పల్లెల్లో పేద ప్రజలకు స్పెషలిస్టు వైద్య సేవలు అందుతున్నాయని ఏపీ ఎంఎస్ఐడీసీ (ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి మురళీధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం వెల్దుర్తి బాలుర హైస్కూల్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. క్యాంప్‌లో అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. రోగుల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి వారి ఆరోగ్య పరిస్థితులు ప్రభుత్వానికి తెలియజేయాలని సచివాలయ, ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. సేవలందిస్తున్న స్పెషలిస్టు వైద్యులు, కంటి వైద్య నిపుణులతో మాట్లాడారు. ఈసీజీ సేవలను పరిశీలించారు. దీర్ఘకాలిక జబ్బులు, తీవ్ర అనారోగ్య పరిస్థితులున్న వారిని పెద్దాసుపత్రికి రెఫర్ చేసి ఉచితంగా అన్ని రకాల వైద్య సేవలు అందేలా చూడాలని డీఎంఅండ్‌హెచ్ఓ రాంగిడ్డయ్యను ఆదేశించారు. ప్యాపిలిలో ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను పరిశీలించాలనని, అన్ని రకాల సౌకర్యాలతో నిర్వహిస్తున్నారన్నారు. వీటిని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ డీఈఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ, ఎంపీడీఓ శ్రీనివాసరావ్, ఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నాడు ఆందోళన.. నేడు ఆనందం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దనే ఠంచన్‌గా పింఛన్ల పంపిణీ



టీడీపీ హయాంలో పింఛన్ల కోసం ఎస్‌హెచ్ ఎర్రగుడి ఊరు వాకిలి వద్ద పడిగాపులు కాస్తున్న అవ్వాతాతలు(ఫైల్)

కృష్ణగిరి: టీడీపీ హయాంలో పింఛన్ అందుకోవడానికి అవ్వాతాతలు ఎన్నో కష్టాలు ఎదుర్కొనేవారు. ఒక పంచాయతీలో ఉండే వందల మంది లబ్ధిదారులకు ఒక్కరే ఇవ్వాల్సి ఉండేది. నెల వచ్చిన రోజు నుంచి లబ్ధిదారులు గ్రామంలోని పంచాయతీ కార్యాలయాలు, గ్రామ చావిడీలు వద్ద పడిగాపులు కాసేవారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసిన సందర్భాలు ఉన్నాయి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి నెలా మొదటి రెండు మూడు రోజుల్లో లబ్ధిదారుల తలుపు తట్టి ఇస్తున్నారు. దీంతో పింఛన్‌దారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెల మొదటి రోజే టి.గోకులపాడులో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

తలుపుతట్టి పింఛన్ ఇస్తున్నారు



నాకు గత 12ఏళ్లుగా పింఛన్ వస్తుంది. టీడీపీ హయాంలో పింఛన్ తీసుకునేందుకు ఐదారు రోజులు ఉదయం నుంచి సాయంత్రం పడిగాపులు కాసిన సందర్భాలు ఉన్నాయి. నా మనువడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక మా బాధలు తప్పాయి. నెల వచ్చిన మొదటి రోజే తెల్లవారక ముందే తలుపు తట్టి వలంటీర్ల ద్వారా డబ్బులు పంపిణీ చేయిస్తున్నారు.

– దివాకరమ్మ, టి.గోకులపాడు

క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం, వాహనంతో పోలీసులు

కృష్ణగిరి: మండల కేంద్రమైన కృష్ణగిరికి సమీపంలో కొత్తపల్లి రోడ్‌లోని క్రసర్ మిషన్ వద్ద జీపులో తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సీజ్ చేసి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు. కృష్ణగిరికి చెందిన బోయ హరి, చిన్నరాముడు బొలెరో వాహనాన్ని వదిలి తప్పించుకున్నారన్నారు. వాహనం ట్రాలీ కింది భాగంలో అరలాగా చేయించిన అమరికలో 70బాక్సులలోని రూ.2,80,000 విలువ గల 6750 టెట్రా ప్యాకెట్లను(90ఎమ్ఎల్) గుర్తించామన్నారు. కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

మహిళపై అత్యాచారయత్నం

- నిందితుడి కోసం పోలీసులు డ్రోన్‌తో గాలింపు

ఆత్మకూరురూరల్: కరివేన చెరువు సమీపంలోని పొలాల్లో పని చేసుకుంటున్న ఓ మహిళపై శుక్రవారం ఉదయం అత్యాచార యత్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పంటపొలంలో ఒంటరిగా పనులు చేసుకుంటున్న ఓ మహిళపై మద్యం మత్తులో ఉన్న ఆగంతకుడు అత్యాచార ప్రయత్నం చేయగా మహిళ ప్రతిఘటించి కేకలు వేసింది. దీంతో సమీప పొలాల్లో ఉన్న రైతులు అక్కడికి రావడం గమనించిన ఆగంతకుడు జొన్న చేనులోకి వెళ్లి దాక్కున్నాడు. సమాచారం అందుకున్న ఆత్మకూరు ఎస్ఐ నారాయణ రెడ్డి తన సిబ్బందితో అక్కడికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే డ్రోన్ కెమెరాను ఉపయోగించి నిందితుడి కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. కాగా సాయంత్రానికి నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, పూర్తి వివరాలు తర్వాత చెబుతామని ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ

- ఆటో డ్రైవర్, గుర్తు తెలియని మహిళ మృతి



మృతి చెందిన ఆటో డ్రైవర్ దాసు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్ తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణానికి చెందిన దాసు తన ఆటోలో ముగ్గురు ప్రయాణికులతో ఆటోనగర్ వైపు రాత్రి 10 గంటల ప్రాంతంలో బయలుదేరాడు. కుందూనది వంతెనపై ముందుగా వెళ్తున్న కారును దాసు ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు అయి ఆటో డ్రైవర్ దాసు(35), అందులో ప్రయాణిస్తున్న గుర్తుతెలియని మహిళ అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రగాయాలపాలైన మరో ఇద్దరిని పోలీసులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

‘ఉపాధి’కి ముందస్తు ప్రణాళిక

మండలాల వారీగా లక్ష్యాలు సిద్ధం

- ఎన్నికల కోడ్‌కు ముందే పరిపాలన అనుమతులకు కసరత్తు
- 10,350 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధికి ప్రాధాన్యం
- 170 కొత్త చెరువుల నిర్మాణానికి చర్యలు
- 25వేల ఫాంపాండ్స్ తవ్వకాలకు ప్రణాళిక
- 1,250 మేకలు, గొర్రెల షెడ్లు ఏర్పాటుకు చొరవ



జిల్లాలో నిర్వహిస్తున్న ఉపాధి పనులు

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024–25 సంవత్సరానికి ముందస్తు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. 2024 ఎన్నికల సంవత్సరం కావడంతో ఉపాధి నిధులతో చేపట్టే పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా గ్రామీణాభివృద్ధి శాఖ తగిన చర్యలు చేపట్టింది. ఫిబ్రవరి మొదటి వారంలోనే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి.. మే నెల చివరి వరకు అమలులో ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఉపాధి నిధులతో చేపట్టాల్సిన కార్యక్రమాలు, అభివృద్ధి పనులపై ఇప్పటికే మండలాల వారీగా లక్ష్యాలను కేటాయించారు. గ్రామాల వారీగా పనుల గుర్తింపు, ఎస్టిమేట్లు జనరేట్ చేస్తున్నారు. ఎన్నికల కోడ్ రాకముందే ఉపాధి నిధులతో చేపట్టే పనులన్నింటికీ జిల్లా కలెక్టర్ ద్వారా పరిపాలన అనుమతులు తీసుకోవాలని గ్రామీణాభివృద్ధి శాఖ నిర్దేశించింది. ఇందుకు అనుగుణంగా చర్యలకు శ్రీకారం చుట్టారు.

10,350 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధి

2023–24లో దాదాపు 5వేల ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేశారు. జిల్లాలో కరువు పరిస్థితులు ఉండటంతో 2024–25 సంవత్సరానికి సంబంధించి 10,350 ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చేయాలనేది లక్ష్యం. వచ్చే ఏడాదిలో పండ్లతోటల అభివృద్ధికి 5 ఎకరాల్లోపు రైతులను గుర్తించే కార్యాక్రమాన్ని చేపట్టారు. లక్ష్యంలో 50 శాతం ఎస్సీ, ఎస్టీలకు కేటాయిస్తుండటం విశేషం.

➡ భూగర్భ జలాల అభివృద్ధి, తాగు, సాగు నీటికి ఇబ్బంది లేకుండా పెద్ద ఎత్తున అమృత్ సరోవర్‌లను నిర్మించనున్నారు. ఎకరా విస్తీర్ణంలో వీటిని నిర్మించాలనేది లక్ష్యం. ప్రయివేటు భూముల్లో ఎకరా విస్తీర్ణంలో నిర్మించేందుకు అవకాశం లేనందున ప్రభుత్వ భూముల్లో నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఆలూరు, ఆస్పరి, క్రిష్ణగిరి, దేవనకొండ, పత్తికొండ, తుగ్గలి, ఎమ్మిగనూరు మండలాల్లో పది, మిగిలిన మండలాల్లో 5 ప్రకారం మొత్తం 170 కొత్త అమృత్ సరోవర్‌లు నిర్మించ తలపెట్టారు.

➡ జిల్లాలో 2024–25లో 25వేల ఫాంపాండ్స్ నిర్మించాలనేది లక్ష్యం. కొత్తగా ప్రతి మండలంలో 1000 ఫాంపాండ్స్ నిర్మించడం ద్వారా భూగర్భ జలాల పెంపు, డ్రై ల్యాండ్ హార్టికల్చర్ అభివృద్ధి తదితరాలకు తోడ్పడేలా ఫాంపాండ్స్ తవ్వకాలు చేపట్టనున్నారు. వీటి చుట్టూ కట్ట తరహాలో బండింగ్ పనులు కూడా చేపట్టనున్నారు.

➡ 2024–25లో గొర్రెలు, మేకల పెంపకానికి అనువుగా ఉపాధి నిధులతో షెడ్స్ నిర్మించుకునే అవకాశం కల్పించారు. ప్రతి మండలంలో 50 ప్రకారం జిల్లా మొత్తంగా 1,250 షెడ్లు నిర్మించాలనేది లక్ష్యం. ఇందులో 50 శాతం ఎస్సీ, ఎస్టీలకు కేటాయిస్తారు. అదే విధంగా పాడుబడిన కోనేరులు, బావులను ఉపాధి నిధులతో పునరుద్ధరించే పనులు చేపట్టాలని నిర్ణయించారు.

పరిపాలన అనుమతులకు ప్రాధాన్యం



ఉపాధి నిధులతో చేపట్టే పనులన్నింటికీ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇప్పటికే లక్ష్యాలను కేటాయించాం. జనవరి చివరి నాటికి జిల్లా కలెక్టర్ నుంచి అన్ని పనులకు పరిపాలన అనుమతులు తీసుకుంటాం. ఈ ప్రక్రియ పూర్తయితే కోడ్ వచ్చినప్పటికీ పనులకు ఎలాంటి అవాంతరం ఉండదు.

– అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా

శ్రీశైల యాత్రకు అమెరికన్లు



వీరభద్రస్వామి వద్ద ఫొటోలు దిగుతున్న అమెరికన్లు

శ్రీశైలంటెంపుల్: యునైటెడ్ స్టేట్ ఆఫ్ అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన ఇద్దరు భక్తులు శ్రీశైలం యాత్రకు వచ్చారు. శుక్రవారం శ్రీశైల శ్రీఖరేశ్వరం నుంచి శ్రీశైలం వెళ్తూ మార్గమధ్యలో వీరభద్రస్వామి వద్ద ఫొటోలు దిగుతూ ‘సాక్షి’కి కనిపించారు. కాలిఫోర్నియాకు చెందిన లూ, అతని తండ్రి ఇద్దరూ ఆటోలో శ్రీశైలం యాత్రకు వచ్చినట్లు వివరించారు. మొత్తం 72 గ్రూపులుగా విడిపోయి ఇండియాలోని వివిధ ప్రాంతాలను సందర్శిస్తున్నామని, ఈ సందర్శనలో భాగంగా తాము శ్రీశైలం వచ్చామని వారు తెలిపారు. శ్రీశైలం అడవులు, ఘాట్‌రోడ్డు ప్రత్యేక అనుభూతిని ఇచ్చిందని వారు తెలిపారు. వారి పర్యటన మొత్తం ఆటోలోనే సాగుతున్నట్లు వివరించారు.

వేలంపాటలో రూ.2.79 కోట్ల ఆదాయం

ఆత్మకూరు: మహానంది దేవస్థానం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, దేవస్థానం చైర్మన్ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వివిధ టెండర్ల ప్రక్రియలో దేవస్థానానికి దాదాపు రూ.2,79,17,935 ఆదాయం సమకూరింది. సెల్‌పాయింట్లస్టాల్‌కు మనోహర్‌రెడ్డి రూ.18.27 లక్షలు, టోల్‌గేట్‌కు శివశంకర్‌రెడ్డి నంద్యాల రూ.1,71,22,535, పాదరక్షలకు రూ.16.3 లక్షలు. సంప్రదాయ దుస్తులకు రూ.8.50 లక్షలు, తలనీలాల సేకరణకు రూ.5.55 లక్షలు, అభిషేక పూజా సామాగ్రి రూ.45.2లక్షలు, మరుగుదొడ్లకు రూ.12.50 లక్షలు, చింతపలసాయం రూ.7,500 పాడి వేలం పాట దారులు దక్కించుకున్నారు. ఫలితంగా మహానందీశ్వరుడికి మొత్తం రూ.2,79,17,935 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు.

నేపాల్ మహిళ ఆత్మహత్య

కర్నూలు: నగరంలో నేపాల్‌కు చెందిన ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. పూర్ణ బహదూర్ అనే వ్యక్తి ఏడాది క్రితం తన కుటుంబంతో నేపాల్ నుంచి కర్నూలుకు వచ్చి బంగారుపేటలో ఉంటున్నారు. స్థానిక ఓ హోటల్‌లో పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఆర్థిక సమస్యల కారణంగా పూర్ణ బహదూర్ భార్య మోనీ రూపా (27) శుక్రవారం సాయంత్రం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిని గమనించిన భర్త వెంటనే ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఆంత్రాక్స్‌పై ఆందోళన వద్దు



కందనాతి గ్రామంలో గొర్రెల పెంపకందారులతో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): ఆంత్రాక్స్ పాజిటివ్ వచ్చినంత మాత్రాన ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పూర్తి స్థాయిలో పరిశోధన జరుగుతోందని ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ రాణి ప్రమీల తెలిపారు. ఎమ్మిగనూరు మండలం కందనాతిలో నవంబరు నెలలో రెండు గొర్రెలు మృతి చెందగా.. వాటి రక్త నమూనాలను విజయవాడ, తిరుపతిలోని పశుసంవర్ధకశాఖ ల్యాబ్‌లకు పంపగా ఆంత్రాక్స్ పాజిటివ్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన పశుసంవర్ధక శాఖ అధికారులు గ్రామంలో నవంబరు నెలలోనే సన్న జీవాలకు 1,410 డోసుల టీకా వేశారు. టీకాలు వేయక ముందు, టీకాలు వేసిన 21 రోజుల తర్వాత సన్న జీవాల రక్త నమూనాలను తిరుపతిలోని వెటర్నరీ యూనివర్సిటీ ల్యాబ్‌కు పంపారు. వీటిపై అధ్యయనం జరుగుతోంది. కాగా, ఢిల్లీ నుంచి సీనియర్ ఇన్వెస్టిగేటర్ షాహసేన్, తిరుపతిలోని వెటర్నరీ యూనివర్సిటీ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ రాణిప్రమీల, కర్నూలు పశు వ్యాధినిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ రవిబాబు, స్థానిక ఏరియా వెటర్నరీ హాస్పిటల్ ఏడీ ఆచారీ, బనవాసి వెటర్నరీ డాక్టర్ అశోక్‌లతో కూడిన బృందం కందనాతికి వెళ్లింది. ఆంత్రాక్స్ వ్యాధి సోకక ముందు, తర్వాత ఉత్పన్నమైన పరిస్థితులపై జీవాల పెంపకందారులతో మాట్లాడారు. ఆంత్రాక్స్ వ్యాధి నిర్మూలన కోసం కందనాతి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుంటామని ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ రాణి ప్రమీల తెలిపారు. పరిశోధన ఫలితాలను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

తిరుపతి ప్రయాణికులకు మనవి

- నంద్యాల డెమో రేణిగుంట వరకు పొడిగింపు
- నేటి నుంచి ప్రారంభం



నంద్యాల(సిటీ): జిల్లా ప్రజలు తిరుపతి వెళ్లేందుకు మరో రైలు అందుబాటులోకి వచ్చింది. నంద్యాల–కడప మధ్య నడిచే 07285/07284 డెమో రైలును రేణిగుంట వరకు పొడిగించారు. శనివారం ఈశాన్య ప్రాంత సాంస్కృతిక, పర్యాటక శాఖాభివృద్ధి మంత్రి కిషన్ రెడ్డి నర్సాపురం నుంచి వర్చువల్‌గా ఈ రైలును ప్రారంభించనున్నారు. నంద్యాల నుంచి ఉదయం 5.50 గంటలకు ప్రారంభమయ్యే ఈ రైలు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల మీదుగా మధ్యాహ్నం 1.30 గంటలకు రేణిగుంటకు చేరుకుంటుంది. నంద్యాల డెమో పొడిగింపుతో తిరుపతి వెంకటేశ్వరస్వామిని దర్శించునే భక్తులకు ప్రయాణ కష్టలు తగ్గనున్నాయి.

రైలు వేళలు ఇలా..

నంద్యాలలో 07285 రైలు ఉదయం 5.50 గంటలకు బయలుదేరి కడపకు 9.40కి చేరుకుంటుంది. అక్కడి నుంచి 9.45కు బయలు దేరి రేణిగుంటకు మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుకుంటుంది. తిరిగి 07284 రేణిగుంటలో మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి కడపకు 5.30, నంద్యాలకు రాత్రి 9.30 గంటలకు చేరుకుంటుంది. నంద్యాల – రేణిగుంట స్టేషన్ల మధ్య మద్దూరు, బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల, నొస్సం, సుప్పలపాడు, జమ్ములమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కమలాపురం, కడప, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, బాలపల్లె స్టేషన్లలో ఈ రైలు ఆగనుంది.

ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి



డెమో రైలు పొడిగింపుతో నంద్యాల నుంచి కడప, రేణిగుంట, తిరుపతికి వెళ్లే ప్రయాణికులు, యాత్రికులు, విద్యార్థులు, అధికారులకు ఎంతో అనుకూలంగా మారింది. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు రైల్వే శాఖ చర్యలు తీసుకుంటోంది. గుంటూరు – నంద్యాల డివిజన్ల పరిధిలోని రైల్వే డబ్లింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే మరింత వేగంగా, సజావుగా ప్రయాణం కొనసాగనుంది.

– ఎస్.దొరస్వామి, స్టేషన్‌మాస్టర్, నంద్యాల

హత్య కేసులో నిందితుల అరెస్టు




నిందితుల అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డోన్ రూరల్: ఉంగరానిగుండ్ల గ్రామంలో డిసెంబర్ 31వ తేదీన అర్ధరాత్రి జరిగిన ఓ యువకుడి హత్య కేసులో 13 మంది నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం డీఎస్పీ శ్రీనివాసరెడ్డి విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వివరించారు. డోన్‌కు చెందిన ఎరుకలి లక్ష్మీనారాయణ ఏడేళ్ల క్రితం ఉంగరానిగుండ్ల గ్రామంలో ఓ పాత ఇంటిని కొనుగోలు చేసిన తర్వాత మరమ్మతులు చేసి కుటుంబంతో అక్కడే ఉంటున్నాడు. గ్రామంలో కేవలం ఒకే ఒక్క ఎస్టీ కులానికి చెందిన ఇల్లు ఉండటాన్ని ఇష్టం లేని నిందితులు తరచూ లక్ష్మీనారాయణతో ఘర్షణ పడుతూ గ్రామం నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఉంగరానిగుండ్ల గ్రామానికి చెందిన చిన్నమద్ది కుమారులు ఓబులేసు, నవీన్ తనను కులం పేరుతో దూషించారని లక్ష్మీనారాయణ అల్లుడు సీతారాము డిసెంబర్ 12వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు కాగా అప్పటి నుంచి వారి మధ్య మనస్పర్థలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. దీంతో డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి లక్ష్మీ నారాయణ ఇంటిపై చిన్నమద్ది, అతని ఇద్దరు కుమారులు ఓబులేసు, నవీన్, తలారి సిసింద్రి, మధు, చిన్న మద్దయ్యతో పాటు మరో ఎనిమిది మంది దాడి చేశారు. ఈ దాడిలో లక్ష్మీనారాయణ కుమారుడు ఖాదర్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ మేరకు 14 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చేస్తుండగా శుక్రవారం టిట్కో గృహాల వద్ద 13 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు రామ్మోహన్ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రూరల్ ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, టౌన్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె చెంతకు కృష్ణమ్మ

- అవుకు సీపీడబ్ల్యూస్కీం మూడో ఫేజ్ పనులు పూర్తి
- తొమ్మిది గ్రామాల మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- త్వరలో ట్రయల్ రన్
- సంక్రాంతికి ప్రారంభోత్సవం



కొలిమిగుండ్ల మోడల్ స్కూల్ సమీపంలో నిర్మించిన గ్రౌండ్ లెవల్ సంప్

కొలిమిగుండ్ల: అవుకు రిజర్వాయర్‌లోని కృష్ణా జలాలతో పల్లె ప్రజల దాహార్తి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సీపీడబ్ల్యూస్కీం మూడో ఫేజ్ పనులు పూర్తయ్యాయి. త్వరలో తొమ్మిది గ్రామాల ప్రజల మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కానుంది. కొలిమిగుండ్ల మండలంలో నాపరాతి గనులతో పాటు వ్యవసాయ ఆధారిత గ్రామాలు ఉన్నాయి. వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటి పోయి తరచూ తాగునీటి సమస్య ప్రజలను వేధిస్తోంది. ఈ గ్రామాల ప్రజలకు శాశ్వత మంచి సౌకర్యం కల్పించేందుకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి శ్రీకారం చుట్టారు. ఇక్కడ నెలకొన్న సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించడంలో సఫలీకృతులయ్యారు. అవుకు రిజర్వాయర్ సీపీడబ్ల్యూస్కీం మూడో ఫేజ్ కింద కొలిమిగుండ్ల మండలంలో బెలుం శింగవరం, ఇటిక్యాల, కనకాద్రిపల్లె, రాఘవరాజుపల్లె, అంకిరెడ్డిపల్లె, తుమ్మలపెంట, చింతలాయిపల్లె, తిమ్మనాయినపేట, బందార్లపల్లె గ్రామాలకు పైపులైన్ ద్వారా నీటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం రూ.8.5 కోట్ల నిధులు విడుదల చేసింది. ప్రస్తుతం పనులన్నీ పూర్తి కావడంతో జనవరి మొదటి వారంలో ట్రయల్ రన్ నిర్వహించేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. కొలిమిగుండ్ల మోడల్ స్కూల్ సమీపంలో 2.5 లక్షల నీటి సామర్థ్యం ఉన్న గ్రౌండ్ లెవల్ సంప్‌లో నీటిని నింపి సిద్ధంగా ఉంచారు. ట్రయల్ రన్ అనంతరం సంక్రాంతికి ఈస్కీంను ప్రారంభోత్సవం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈస్కీం పరిధిలో ఇప్పటి వరకు మూడు ఫేజ్‌ల్లో రూ.36.50 కోట్లతో కొలిమిగుండ్ల, అవుకు, సంజామల, కోవెలకుంట్ల మండలాల్లోని 56 గ్రామాలకు రోజుకు 90 లక్షల నీటిని అవుకు రిజర్వాయర్ నుంచి ఫిల్టర్ చేసి నీటి సరఫరా చేస్తున్నారు.

అన్ని పనులు పూర్తి



సీపీడబ్ల్యూస్కీం మూడో ఫేజ్‌కు సంబంధించి అన్ని పనులు పూర్తి చేశాం. త్వరలోనే ట్రయల్‌రన్ చేసి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నాం. పైపులైన్ ఎక్కడా లీకేజీ కాకుండా కొత్త పైపులైన్ ఏర్పాటు చేశాం. ఈస్కీం ప్రారంభమైతే 9 గ్రామాల్లో తాగు నీటి సమస్య పరిష్కారం కానుంది.

– ఉమాకాంతరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

పకడ్బందీగా భూ సర్వే

- జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి



జేసీకి సమస్యను వివరిస్తున్న రైతు

అవుకు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. చెన్నంపల్లె గ్రామంలో రీ సర్వే అనంతరం నిర్వహించిన గ్రామసభకు జేసీతోపాటు డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డి తదితరులు హాజరయ్యారు. గ్రామ సభలో రైతులతో మాట్లాడి అక్కడ సమస్యలను తెలుసుకున్నారు. రీ సర్వే అనంతరం విస్తీర్ణం, ఎల్‌పీ నంబర్లలో తప్పులు వచ్చాయని గ్రామ రైతులు జేసీకి విన్నవించారు. అయితే రీ సర్వే జరిగే రోజు ఆ సర్వే నెంబర్లకు సంబంధించిన రైతులు హాజరు కాకపోవడంతో రైతులందరికీ ఒకే ఎల్‌పీ నంబర్లు వచ్చాయని అవుకు తహసీల్దార్ పోతుల ప్రసాద్ తెలిపారు. భూరీసర్వే చేసి దాదాపు వంద సంవత్సరాలకు పైగానే అయిందని, దీనివలన చిన్న చిన్న తప్పులు దొర్లింటాయని జేసీ పేర్కొన్నారు. వాటిని సవరించటానికే రీ సర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభ నిర్వహిస్తున్నామన్నారు. ఆయా గ్రామాల్లో రీ సర్వే సమస్యలపై రైతులు అర్జీలు ఇస్తే వాటిని మండల రెవెన్యూ అధికారులు పరిశీలించి పరిష్కరిస్తారన్నారు. ఇప్పటి వరకు డలంలో అన్నవరం, చెన్నంపల్లె, శివవరం, నిచ్చెనమెట్ల, వేములపాడు, శింగనపల్లె, మెట్టుపల్లె, చెర్లోపల్లె గ్రామాల్లో భూ రీసర్వే పూర్తయిందన్నారు. నేటి నుంచి 16వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి, మండల సర్వేయర్ హరి, ఆర్ఐ రాముడు, సర్పంచ్ లచ్చమ్మ, గ్రామ సర్వేయర్లు, వీఆర్‌ఓలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిప్పగిరి: మండల కేంద్రంలో పేకాట ఆడుతున్న పలువురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ సుబ్రమణ్యం శుక్రవారం తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. పేకాట ఆడుతూ పట్టుబడిన వారిలో రామంజి, జయరాముడు, జయపాల్, వెంకటరాముడు, కిష్టప్ప, రాజశేఖర్, షేక్షావలితో పాటు మరికొంత మంది ఉన్నారన్నారు. వారిపై కేసు నమోదు చేసి రూ.1,55000 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



కలుపు తీత కొత్తగా...



వ్యవసాయంలో రోజురోజుకు సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోతుంది. సాగులో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు నూతన యంత్రాలు అందుబాటులోకి వస్తున్నాయి. సాధారణంగా ఎకరా పొలంలో కలుపు తీతకు 15 మంది కూలీలు అవసరం. ఒక్కో కూలీలకు రూ. 200 నుంచి రూ.250 వరకు ఇవ్వాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఉమాపతి నగర్‌కు చెందిన రైతు ఉమామహేశ్వరరావు పొగాకు సాగు చేశాడు. తన పొలంలో కలుపు తీతకు వినూత్నంగా ఆలోచించి ఒక్కో యంత్రానికి రూ.1,500 వెచ్చించి ఐదింటిని కొనుగోలు చేశాడు. ప్రస్తుతం కేవలం ఒక్క కూలీతోనే ఎకరా పొలంలో కలుపును తొలగిస్తున్నారు. చాలా మంది అటుగా వెళ్లే రైతులు వాటి గురించి పూర్తిగా తెలుసుకుని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

– దొర్నిపాడు

గాలేరు నగరి కాల్వకు నీరు విడుదల

- గట్టెక్కనున్న మిర్చి రైతులు

కొలిమిగుండ్ల: రైతుల ప్రయోజనాల దృష్ట్యా అవుకు రిజర్వాయర్ నుంచి చెర్లోపల్లె సమీపంలోని గాలేరు నగరి వరద కాల్వకు శుక్రవారం అధికారులు నీటిని విడుదల చేశారు. కొలిమిగుండ్ల మండలంలోని పెద్దవెంతుర్ల, కమ్మవారిపల్లె, కోటపాడు తదితర గ్రామాల రైతులు మిరప పంటను విస్తారంగా సాగు చేశారు. ఈసారి వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సంబంధిత అధికారులతో చర్చించి అవుకు రిజర్వాయర్ నుంచి 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించారు. సరిగ్గా నెల రోజుల క్రితం 600 క్యూసెక్కుల నీళ్ల వదలడంతో కాల్వ వెంట పంటలు సాగు చేసిన రైతులు ఆయిల్ ఇంజన్‌లు, కరెంట్ మోటర్ల సాయంతో పంటలకు నీళ్ల మళ్లించుకున్నారు. ప్రస్తుతం రెండో విడతలో కాల్వకు నీరు చేరడంతో కొలిమిగుండ్ల, అవుకు మండలాలతో పాటు వైఎస్సార్ కడప జిల్లా మైలవరం మండలంలోని గ్రామాలకు రైతులకు ఉపయోగకరంగా మారింది. పంట కోత వచ్చే వరకు మిరపతో పాటు ఇతర పంటలకు నీటి తడులు పెట్టుకునేందుకు సరిపోతాయని రైతులు పేర్కొన్నారు. అడిగిన వెంటనే అధికారులతో చర్చించి రెండు సార్లు కాల్వకు నీళ్ల విడుదల చేయించడంతో ఆయా గ్రామాల రైతులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.